ఆడమనసు - మగమనిషి

పొలప్రగడ వెంకటేశ్వరరావు

'...మా అమ్మమ్మని మా తాతయ్య కొట్టేవాడు. నోరెత్తేదిగాదు. మా బామ్మని మరో తాతయ్యా, నలుగురెదుటా అవమానించేవాడు. కిక్కురు మనేదిగాదు. ఎందుకు అన్న ప్రశ్న వచ్చేదిగాదు. మా అమ్మని నాన్న తిట్టడం నే నెరుగుదును. చాటున కళ్ళు వత్తుకుని ముక్కు చీదుకునేది అమ్మ. చీదుకుని నన్ను కావలించుకొని, 'నాన్నా, నువ్వుమాత్రం ఇట్లా చెయ్యకొవద్దురా' అనేది. నేనుమాత్రం ఇట్లా చెయ్యను అనుకునేవాణ్ణి. ఇప్పుడు అట్లా చెయ్యటంలేదుకూడాను.

స్త్రీ మగవాడి ఆస్తిక్రింద చలామణి అయే రోజులు పోయేయి నేటి స్త్రీ అట్లా పడివుండటం లేదు తనకూ ఒక వ్యక్తిత్వం వుందనీ- తనూ మనిషేననీ- అంటూవుంది. తన ఆస్తిత్వాన్ని నిల్పుకోటానికి ప్రయత్నం చేస్తూవుంది. పోరాటం సల్పుతూవుంది. ఆ ప్రయత్నంలో గెలుపు సాధిస్తూవుంది. ఇది శుభ పరిణామం. ఏ దేశంలో అయితే స్త్రీ వ్యక్తిగా గుర్తింపబడుతుందో- ఏ దేశప్రజలు స్త్రీని దేవతగా ఆరాధిస్తారో- ఆ దేశంయొక్క సంప్రదాయం వుత్కృష్టమైనదిగా పరిగణింపడుతుంది. ఈ సిద్ధాంతం మన దేశంలో అనాదిగా

వున్నది- కానయితే మధ్యకాలంలో విస్మరింపబడింది. ఇవాళమాత్రం స్త్రీ హక్కులు గుర్తించబడినయి. స్త్రీ వ్యక్తిత్వానికి పరిగణన లభించుతూంది. పురుషుడు స్త్రీని అర్థం చేసుకోవటాన్కి ప్రయత్నిస్తున్నాడు. ఆమె పురోగతిలో చాతనయిన సాయం చేస్తూవున్నాడు. ఇది గొప్ప పరిణామం. అందుకే నేటి స్త్రీ కృషిని మనం ప్రశంసించాలి. అందుకు సహకరిస్తున్న పురుషుడి ధోరణి హర్షించబడాలి. ఇతఃకృష్టతని మనం గ్రహించాలి. గ్రహించి నేటి నవ భారత నవలామణికి అన్నివిధాలా చేయూతనివ్వాలి'... రాంరావు వుపన్యాసం ముగిసింది. కరతాళ ధ్వనులతో హాలు మారుమ్రోగింది. ముందువరసలో కూర్చునివున్న రాంరావుభార్య రాంభాయి చిరునవ్వుతో గర్వంగా భర్తని చూసింది.

మీటింగు అయి బయటికి వచ్చాక రాంభాయి సినిమా ప్రపోజలు పెట్టింది.

'ఇంటికెళ్లొద్దూ? పిల్లలువచ్చి అల్లరి చేస్తారేమో?' అన్నాడు రాంరావు, ఆలోచిస్తూ. 'ఫర్లేదులెద్దురూ. సీత వుందిగా. చూసుకుంటుందలె,' అంది రాంభాయి.

వాళ్ళు ఎక్కిన రిక్షా సినిమాహాలు వయిపు పరుగెత్తింది.

సరిగా అదేసమయంలో 'రాంరావు ఇంటి'దగ్గర సీత పొయి రాజేసి మండని కట్టెలతో యుద్ధం చేస్తూంది. ఆ ఇంట్లో మూడు సంసారాలున్నాయి. అందులో ఒకటి భీంరావుగారిది. ఆయనకి ఆయన భార్యకి ఒకరికొకరి పట్టదు. సంతానం లేదు. ఆయనది మంచి వుద్యోగమే. వెనకాల ఆస్తివుంది. వంటపనిలేదు. భార్యాభర్తలు ఇద్దరూ 'టిప్‌టాప్'గా తిరిగి హోటల్‌లో భోంచేసివచ్చి తలుపులు మూసుకుంటారు. రెండవది రాంరావు సంసారం. భార్య రాంభాయి. ముగ్గురు పిల్లలు. గారాబం ఎక్కువ. అందుకే ముగ్గుర్నీ మూడు కోతులన వచ్చు. ఇంట్లో రాంభాయిమాటే రాంబాణం రాంరావు భార్యకి జడుస్తాడు అంటే ఒప్పుకోడు రాంరావుది చిన్న వుద్యోగం, బి. ఎల్. చదివాడు అందువలన లాజిక్కుతీసి, తన 'హెన్‌పెక్‌డ్‌నెస్'కి కొత్త అర్థాలు చెప్తాడు. పైగా రాంరావు రచయిత. స్టేజి ఎక్కితే అతన్ని పట్టుకోవటం కష్టం. అతని వుపన్యాసాలు శ్రోతలకి తమాషాగా వుంటాయి దాన్ని అభినందనగా తీసుకుని అతను పొంగిపోతాడు. సీత రాంరావుకి చెల్లెలు. భర్త ఈ మధ్యనే పోయేడు. అప్పట్నుంచి ఆమె అన్న పంచన చేరింది. రాంరావుకి చెల్లెలంటే విపరీతమయిన జాలి. కాని అది చూపించటానికి రాంరావు వెనకాడతాడు. రాంభాయిమీద తన గౌరవాభిమానాలే అందుకు కారణం అని అనుకుని తృప్తి పడతాడు. అభ్యుదయ భావాలుగల తన భర్త మరి భార్య మాటకి విలువ ఇవ్వాలిగదా!

ఆ మధ్యాహ్నం, మీటింగుకి బయలు దేరేటప్పుడు రాంరావు భార్యని సంప్రదించాడు. 'సీతనుకూడ తీసుకెడదాం, ఏమంటావు?' అని.

'సీత ఎందుకూ?!' అని ఆశ్చర్యపోయింది రాంభాయి.

'వూరికే. మనతోపాటు వస్తుంది. రానీరాదా?'

'మీరు భలేవారండి! ఇల్లు ఏమయిపోవాలి? పిల్లలు స్కూళ్ళనించి వస్తారు. వంటపని—ఇంటిపని ఎట్లా? వచ్చినాక మీరు చేస్తారా?' అంటు అడ్డుపడింది. రాంబాబు అదేదో ఆతని డ్యూటీ అయినట్లుగా. రాంరావు తెల్లమొహం వేసేడు. 'అవు న్నిజం' అని గొణిగి భార్యవెంట మీటింగుకి బయలుదేరాడు అతనికి అంత తృప్తిగాలేదు. కాని సంసారం సాఫీగా సాగాలంటె కొన్ని కొన్ని కోరికల్ని భర్తో, భార్యో చంపుకోవాలి. తప్పదు, అనుకొని నోరుమూసాడు, రాంరావు

సినిమాలో భార్య పక్కనకూర్చున్నాదన్నమాటేగాని రాంరావు సీతగురించి ఆలోచిస్తూనే వున్నాడు ఒక్కగా ఒక్క తోబుట్టువు. తలిదండ్రులు లేరు. భర్త పోయి నిండుయవ్వనాన్ని అడివిగాచిన వెన్నెల చేసుకుని తన పంచన చేరింది. ఆమెకోసం తను ఏం చేయ్యగల్గుతున్నాడు? స్టేజిఎక్కి స్త్రీ జనాభ్యుదయం గురించి వుపన్యాసమైతే ఉద్రేకంగా దంచేడుగాని ఆచరణలో ఏం చెయ్యగల్గుతున్నాడు?

సరిగా అదేప్రశ్న, అదే సమయంలో, తన గది తలుపుదగ్గర కూర్చుని సందుల్నుంచి సీతనిచూస్తూ, తనకి తనూ వేసుకున్నాడు రంగారావు. రంగారావు చిరుద్యోగి. వెనకముందూ ఎవరూ లేరు స్నేహితులే అతని బంధువులు. ఆతను పైల్‌మాన్‌లా గుంటాడు. వ్యాయామం చేసిన శరీరం. కాని కారునలుపు. తనని చూసి ఏ ఆడపిల్లా మస్ఫూర్తిగా ఇష్టపడదని అతను స్వానుభవంవలన నేర్చుకున్నాడు అందుకే రంగారావుకి ఆడపిల్లలంటే అభిమానం, జాలి. రంగారావు పత్రికలు అదేపనిగా చదువుతాడు. మీటింగుల కెళ్ళి ఉపన్యాసాలు వంటపట్టించుకుంటాడు. రాంరావు ఆ ప్రాంతపు ఆస్థాన ఉపన్యాసకుడు గనుక రంగారావు రాంరావు ఉపన్యాసాలుకూడ అనేకసార్లు వినివున్నాడు. విని రాంరావుమీద గౌరవం పెంచుకున్నాడు అయితే, ఆ గౌరవం ఈమధ్యన పునాదుల్తోసహా కదిలిపో ఉంది

ఇంటిఅద్దె భరించలేనని, తన పోర్షనులో ఒకగదిని రంగారావుకి అద్దెకిచ్చాడు రాంరావు. ప్రత్యక్షంగా అన్నీ చూస్తూ రాంరావు ఉపన్యాసాలు గుర్తుకు తెచ్చుకొని ఇప్పుడు పళ్ళు నూరుతాడు. రంగారావు. 'దమ్ము లేదు. పెళ్ళాంచెపినట్ట ఆడే దద్దమ్మ. గతిలేక పంచను చేరని,

స్వంత చెల్లెలనయినా జాలిలేక పని మనిషిగా ఆ పిల్లని ఉపయోగించుకొని అన్యాయం చేస్తున్నాడు. ఎందుకు వీడి ఉపన్యాసాలు?' అని గిలగిలలాడుతాడు రంగారావు. మరి - గదిలో తను చేరి నప్పట్నుంచి చూస్తున్నాడు. అతను అప్పట్నుంచి సీతకి సానుభూతి తెల పాలని ప్రయత్నం. కాని అటునుంచి రెస్పాన్సు లేదు.

కట్టెలు మండటంలేదు.

పొగకి కళ్ళలో నీరు కారుతున్నాయి. పొయిమీద ఎసరుపెట్టి కళ్ళుతుడుచుకొని బావిలోంచి నీళ్ళుతోడాలని బిందెతీసుకు వెళ్ళింది సీత.

అదేసమయానికి మొహం కడుక్కు నేందుకు అక్కడికి వచ్చాడు రంగారావు.

'పాపం ఒక్కళ్ళూ, ఎంత శ్రమ పడ్తున్నారు? ఇంత కష్టమయిన పన్లు మీరు చెయ్యగల్రా? ఆగండి, నేను తోడు తాను' అని చేద అందుకున్నాడు రంగా రావు

సీత మాట్లాడలేదు, మెదలకుండా అవతలకి వెళ్ళిపోయింది.

అరగంట తర్వాత ఆమె బావిదగ్గ రకి వచ్చేసరికి రంగారావు లేడు కాని బిందెలన్నీ నీళ్ళతో నింపివున్నాయి

కోతులు ఇల్లుచేరేసరికి వంటయింది. కాని అమ్మాబాబుల్లేరని గొడవచేసి అలిగి, అన్నం తినకుండానే పడుకున్నాయి కోతులు, సీత ఎంత బతిమాలినాకూడా వినకుండానె. సినిమానించి వచ్చాక మొగుడుతో కలిసి భోంచేస్తూ, సీత పిల్లలకి అన్నాలు పెట్టనందుకు ఆరిచి అక్షింతలువేసింది రాంబాయి. హోట ల్నించి, భోంచేసి అప్పుడే వచ్చిన రంగారావు, అది విని 'యుద్ధం మొదలై నట్లుంది, పాపం!' అనుకున్నాడు ఓ సెకన్ను పాలని తిరగేసి ఆవులించి రంగారావు లైటార్పేసరికి ప్రక్కగది తలుపుసందునించి కిరకిరలు, గలగలలూ వినవచ్చాయి 'వీళ్ళ కిక పనిలేనట్లుంది?' అనుకుని రంగారావు వెనకతలుపుతీసి పెరట్లోకి వెళ్ళేడు, సిగరెట్టు వెలింగిచు కొని

బావిదగ్గర, వెన్నెట్లో ఇన్ని అంట్లు ముందేసుకుని గరగర తోమిపడే స్తూంది, సీత.

'పాపం! ఒక్కరూ చీకట్లో పనిచేసు కుంటున్నారా,' అంటు నూతి గట్టుమీద కూర్చున్నాడు రంగారావు సీత మాట్లాడ లేదు.

'ఏమండీ? నాతోమాట్లాడరు? నన్ను చూస్తే అసహ్యమా?' అన్నాడు. సీత నవ్వునాపుకుంది.

'నన్నుచూస్తేఎవరయినా అంతేలెండి. నాకు అందంలేదు. అందువలన ఎవరికి మాత్రం నాతో మాట్లాడాలని వుంటుంది?' అన్నాడు జాలిగా, మళ్ళీ 'అదేం లేదులెండి. మీకేం తక్కువ? మగ మహారాజులు.' అంది సీత జాలిపడి.

ఆడదానికి గుండెల్లో కొంచెం జాలి కలిగిందంటె, వరద కట్టకి గండీపడి నట్టె. 'అదిగాదండి. అసలు నాకే ముందని? తల్లా? తండ్రా? తోడబుట్టిన వాళ్ళా? ఎవరూ లేరు. తోడు లేరు. ఎందుకు నా బ్రతుకు· నేనంటే అందరికీ అసహ్యం. అప్పుడప్పుడు చచ్చిపోదా మనిపిస్తుంది '– అన్నాడు అవకాశం దొరకబుచ్చుకొని.

సీతగుండె ఆర్ద్రమయింది.

'అయ్యో. అంతపని చెయ్యకండి' అంది సీత కంగారుగా.

'సీతగారు! మీరే చెప్పండి. ప్లీజ్. నేను ఎందుకు బ్రతకాలి? ఎవరికోసమని? నేను, నా వుద్యోగం, నా సంపాదన- ఇవన్నీ ఎందుకు? మీమట్టుకుమీరు నన్ను అసహ్యించుకుంటున్నారు. అందుకే ఇంతకాలంగా నేను మీ సానుభూతి కోసం ఎంత ప్రయత్నించినా మీరు కఠినంగా తప్పుకు తిరుగుతున్నారు. అవునా?'

మగబుద్ధి అంతే.

ఆడదాని మనసు కరిగిందని గ్రహిస్తే చాలు దాన్ని ఎక్స్‌ప్లాయిట్ చెయ్యటానికి ప్రయత్నిస్తాడు, మగాడు.

'అదిగాదండి...నేను.. నేను. అయ్యో మీకెలా చెప్పను?'

'సర్లెండి. ఒక మాట చెప్పండి. నేనంటే మీకు అసహ్యమా?'

కాదని తల అడ్డుగా తిప్పింది, సీత.

"అది చాలు నాకు. థాంక్స్. మరి నాతో మాట్లాడటానికి మీకు అభ్యంతరం లేదుగా?'అంటూ సీతని 'కార్నర్' చేసాడు రంగ్రావు.

'అదిగాదు ... నేను ... నా భర్త పోయారు. గతిలేక ఈ పంచనుచేరాను నాతో మీకు మాటలేమిటి? ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు?'- అంది భయంగా.

'పిచ్చి సీతా! అదా నీ భయం? మీ అన్నను అడుగు. ఒక వుపన్యాసం ఇవ్వమను. తెలుస్తుంది. శ్రీజనాభ్యుదయంకోసం అతను అహర్నిశలూ పాటు పడుతున్నాడు. వీరేశలింగం గురించి చెపుతాడు. విధవా వివాహాల్ని గురించి మాట్లాడ్తాడు. విడాకులంటూ లెక్చర్లిస్తాడు. ప్రపచం మారుతోంది సీతా! నాలాంటివాడు సిద్ధపడితే నీవు మరలా వివాహం ఎందుకు చేసుకోవు? నీకేం తక్కువని? అన్యాయంగా నిన్ను వాళ్ళు పనిమనిషిగా వాడుకుంటున్నారే? నీ జీవితం ఇట్లా అడివిగాచిన వెన్నెల కావలసిందేనా? నీ గురించి ఎవరికి జాలి? ఛీ. ఈ ప్రపంచానికి దయలేదు. సానుభూతి లేదు. పైగా దక్కేది చివాట్లూ, చీదరింపులేగా? అదే నా బాధ..'

కన్నీరు పెట్టుకొని సీత తోమిన గిన్నెలు తీసుకుని ఇంట్లోకి వెళ్ళి పోయింది. సీత మరల వస్తుందని చాలా

సేవు చూసి రంగ్రావు ఇంటో కెళ్ళి నిద్ర పోయాడు.

ఈ ప్రపంచంలో అనాదిగా దోపిడీ సాగుతూనే వస్తూవుంది.

ఎదుటి మనిషి వీక్‌పాయింటు పట్టుకుని, 'ఎక్స్‌ప్లాయిట్' చేయాలన్న తాపత్రయం మనిషిని పిచ్చివాణ్ని చేస్తుంది.

స్నేహితుడింటికి అని—ఆ మర్నాడు రాంరావు, భార్యని, పిల్లల్నీ తీసుకుని, సీతని ఇంటికి కాపలావుంచి, వెళ్ళినప్పుడు, మరల సీతని పట్టుకున్నాడు రంగ్రావు.

'సీతా! నా గురించి నీకు సందేహం వద్దు. నువ్వు సరేనంటె ఈ క్షణాన నిన్ను పెళ్ళిచేసుకోటానికి సిద్ధంగా వున్నాను. నా మాట విను. ఎన్నాళ్ళీ చాకిరీ, ఈ నరకం? ప్చ్. వద్దు. సీతా! నువ్విట్లా అన్యాయమవటం నేను సహించలేను,' అన్నాడు.

సీత కన్నీరు పెట్టుకొని జాలిగా చూసింది

'సీతా! నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తాను. నీకోసం ఏమయినాచేస్తాను. దేవతలా పూజిస్తాను. నన్ను అనుగ్రహించు. ప్లీజ్!' అని బ్రతిమాలాడు

'నేను అభ్యుదయవాదిని. నీ మనసుకేం కష్టంరాకుండా చూసుకుంటాను మీ అన్నయ్య, వదిన్ని చూసుకున్న దానికంటె బాగా చూస్తాను. ఇంక నన్ను ఏడిపించకు. సీతా. ప్లీజ్. నన్ను కాదనకు,' అంటూ కన్నీటితో పిచ్చిగా చూస్తూవున్న సీతని ఆవేశంగా చేతుల్లోకి తీసుకోబోయాడు.

ఒక్కసారిగా మేల్కున్నట్లయి 'వద్దు. వద్దు,' అని విదిలించుకుని పారిపోయి తలుపేసుకుంది సీత, జాలిగొలిపేట్టు ఏడుస్తూ.

రంగారావు విలవిలలాడిపోయేడు.

కసిగా పళ్ళు కొరుక్కున్నాడు.

'రాంరావ్! ఏది నీ అభ్యుదయం? నీ పిండాకూడు. రాస్కెల్, నువ్వు పెళ్ళాం పిల్లలతో షికార్లుకొట్టి కులుకుతున్నావ్. ఇవతల నీ రక్తం పంచుకు పుట్టిన తోబుట్టువు, దిక్కుతోచక గిలగిల కొట్టుకుంటూ వుంది. ఏం పట్టించుకొన్నావ్? ఏంచేస్తున్నావ్? నిన్ను ఏం చేస్తే పాపం వుంటుంది? ఎదటివాడికయితే ఉపన్యాసాలు దంచుతావ్? అదేగా నీ తీరు. ఉండు నీ పని చెపుతాను,' అనుకుని గది తలుపులు 'ఢాం' మనివేసి వెళ్ళిపోయాడు, బైటకి.పూర్తిగా సీతని ఎక్స్‌ప్లాయిట్ చెయ్యలేక రంగ్రావయితే రాంరావునికోపంతో అన్ని మాటలన్నాడు కాని రాంరావులో నిజాయితీ లేకపోలేదు. రాంరావు సీత గురించి రోజూ తెగబాధపడిపోతూనే వున్నాడు. కాని అది బయటికి వెలిబుచ్చటానికి అవకాశాలు లేవు. ఒక ఆడదే తోటి ఆడదాన్ని అవసరంకోసం వాడు

కొనాలని, అణచి వుంచాలని స్వార్థంతో తాపత్రయం పడిన పరిస్థితి ఎదురైనపుడు ఏ మగవెధవమాత్రం ఏం చెయ్య గల్గుతాడు ? ఒకవేళ చెయ్యటానికి ప్రయత్నించి, చిత్తశాంతీ, గృహశాంతీ కరువైతే ఎలా సంసారం సాగిస్తాడు ? ఇది బహు సున్నితమయిన సమస్య. ఓర్పు-నేర్పువున్నా పరిస్థితులు అనుకూలించకపోతే అట్టివాడు రాంరావులాగ తిట్లు తినవలసిందే.

అక్కడికీ రాంరావు ఒకటి రెండు సార్లు సీత పునర్వివాహం గురించి రాంబాయితో ప్రస్తావించాడు. ఆమె ఉగ్రురాలై 'ఛీ వూరుకోండి. మన ఇంటా వంటా లేదు' అంది. రాంరావు నచ్చ చెప్పబోయాడు. 'మీకు పిచ్చి ఎక్క లేదుగదా! ఒకవేళ ఏ పిచ్చివాడో ముందుకొచ్చినా, వాడు ఈ రెండో పెళ్లి దాన్ని చిరకాలం ఏలుకుంటాడన్న నమ్మకం ఏమిటి? లేనిపోని లంపటం. పైగా-నా వంట్లో బాగా లేదని మీకు తెల్సు. పనిమనిషిని పెట్టగలమా ? సీతని అలా పంపేస్తే మన గతి ఏంగాను ? మీరు పడతారా ఆఫీసు బాధా ? ప్లస్ ఇంటిగొడవా రెండూ ? అలా అయితే చెప్పండి?' అని రాంరావుని నొక్కిపట్టింది.

రాంరావు హతాశుడై ఊరుకుండి పోయాడు.

'కనుక నోర్మూసుకొని మీ ఆదర్శాలని ఉపన్యాసాల వరకే పరిమితం చెయ్యండి. అందరికీ మంచిది,' అని హితోపదేశం చేసింది రాంబాయి. సంఘ సంస్కారం గురించి పదేపదే వాగేవాడికి ఇటువంటి పరిస్థితి ఎదురైనపుడు మనసు గిలగిలలాడ్తుంది.

ఆదర్శాలు మాటిమాటికి గుర్తువచ్చి గుండెల్ని తొలిచేస్తయి.

అయినా స్వార్థానిది పైచెయ్యి అయినపుడు మనస్సు కిక్కురుమనకుండా చచ్చి వూర్కుంటుంది.

ఆ మర్నాడు చెయ్యదల్చుకున్న పనిని చేసాడు రంగ్రావు, ఆవేళపరులకి ముందూ వెనుకా వుండదు. సాయంత్రానికి-ఆఫీసులో పగలల్లా కొట్టుకుని అలిసి గొడుగు చేతపట్టుకుని ఇల్లు చేరిన రాంరావుని, కాపువేసివున్న రంగారావు, 'ఏమండీ! రాంరావుగారూ! మాట' అని పిలిచి అవతలకి తీసుకెళ్ళాడు.

'ఏమిట్రా బాబు?'అనుకుంటూ వెళ్లిన రాంరావు చెవిలో చెవిపెట్టి 'నా మాట విని ఒక పని చేస్తారా? చేస్తే అందరికీ మంచిది. లేకపోతే అల్లరితప్ప ఏం మిగలదు?'అన్నాడు, రంగారావు. 'ఏమిటండీ విషయం?' అని ఆశ్చర్యంగా చూసేడు రాంరావు.

'మీ సీతని నా కిచ్చి పెళ్ళిచేయండి' అన్నాడు రంగారావు తాపీగా.

'ఏం? ఎందుకని?' అని కళ్లెర్ర చేసాడు రాంరావు.

'వినండి మరి. నేను సీతకి కడుపు చేసేను. తర్వాత మీ ఇష్టం,' ధీమాగా అన్నాడురంగ్రావు మరుక్షణం రాంరావు

గొడుగు రంగారావుమీద విరుచుకు పడింది. తప్పుకుంటే రాంరావుని, అతని గొడుగుని పట్టుకుని వంగదీసి మూలను పెట్టగలశక్తి కండలు తిరిగిన రంగారావు శరీరానికుంది కాని రంగారావు పూర్కా్ని దెబ్బలు తిన్నాడు! ఎదురు తిరగలేదు.

రంగారావు తల పగిలి రక్తం వరద లైంది. ఈలోగా షికారెళ్ళి వచ్చిన భీంరావు దంపతులు 'అరెరె! ఏమిటది ? ఏమయింది ? అయ్యయ్యో...' అంటూ కేకలు వేసారు. ఆ కేకల్ని, రక్తాన్ని చూసి కన్ను చెదిరిన రాంరావు పరుగెత్తేడు, పిచ్చాడిలాగా.

ఆ రాత్రి రాంరావుకోసం చూసిచూసి- అన్నాలు తిని రాంభాయీ, పిల్లలూ నిద్రపోయేక-నెత్తిమీద కట్లతో మంచం మీద పడుకుని, పైన వాసాలు లెక్కపెడుతున్న రంగారావు దగ్గరకి- వెనక తలుపుతోసుకుని. దొంగచాటుగా కాఫీ గ్లాసు తీసుకువచ్చింది సీత.

వచ్చి, ఇచ్చి, 'ఏమండీ ఏమయింది? అసలు అన్నయ్య మిమ్మల్నెందుకు కొట్టేడు?'-అని ఏడ్చింది. 'అయితే నువ్వు చూశావన్నమాట?' అన్నాడు. తలూపింది. సీత.

రంగారావు హీరోచితంగా నవ్వాడు.

నవ్వి, 'సీతా! ఏం చెప్పమంటావు' ఇప్పటి కిది అదృష్టమేననాలి. రేపు, ఇంటికి తిరిగివస్తే మీ అన్నయ్య నన్ను పొడిచి చంపేస్తాడు. ఖాయం' అన్నాడు.

'అయ్యో, ఎట్లాగ ? అసలు ఎందుకొచ్చింది గొడవ?' అంది సీత జాలిగా.

'నీ గురించే సీతా ! లేకపోతే అసలు మాకేం గొడవలున్నాయి? పోన్లె, నేను నీ గురించి ప్రాణాలు వొదులుకోడానికైనా సిద్ధం. సంతోషంగా పోతాను కాని సీతా! నీ గురించే నా బాధ నీ సుఖం గురించే నా తాపత్రయం. ఒకవేళ నేను మీ అన్నయ్య చేతుల్లో చచ్చిపోయినా నన్ను గుర్తుంచుకుంటావు గదూ!' అని జాలిగొలిపేట్టు అన్నాడు రంగారావు

ఎక్స్ప్లాయిటేషన్ పూర్తయింది !

రంగారావు పాదాలదగ్గర కూలబడి వాటిని కన్నీళ్లతో తడిపింది సీత.

భయంతో రారెత్తి ఎక్కడెక్కడో తిరిగి తిరిగి-బిక్కుబిక్కుమంటు మరునాడు ప్రొద్దుగూకి ఇల్లు చేరిన రాంరావుని-ఖాళీ అయిన రంగారావు గదీ - దావానంలాగ మండిపోతున్న రాంభాయీ పల్కరించారు, చిటపటగా. ఆ చిటపటల్ద్వారా-

-సీతని రంగారావు తీసుకెళ్ళిపోయిన వైనం విని రాంరావు ఒక విధంగా సంతోషించాడు-కాగల కార్యం గంధర్వులు తీర్చినందుకు. మరొక రకంగా విచారించాడు, చచ్చిపోయిన మనసు మరల బ్రతికి తిట్టిన తిట్లకి.

ఆ తర్వాత భీంరావుద్వారా రాంరావుకి తెల్సింది-వాళ్ళిద్దరూ పెళ్ళిచేసుకుని ఆ వూళ్ళోనే వేరేచోట కాపురంపెట్టి సుఖంగా వున్నట్టు తెల్సి ఆశ్చర్యానంద విచారాల్తో నిట్టూర్చాడు, రాంరావు.